వైభవంగా ప్రసన్నాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన

పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): హవేళీఘనపూర్ మండలం రాజ్ పేట్ గ్రామంలో శ్రీ సహకార ప్రసన్నాంజనేయ శివ పంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు. ఆమె వెంట హవేళీఘనపూర్ మండల అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సరిత సాయగౌడ్, యామిరెడ్డి, లింగం, లక్ష్మీనారాయణ, సాయిలు, కిషన్, చెన్నాగౌడ్, మాజీ ఎంపీటీసీ సిద్ధారెడ్డి, దుర్గారావు, నాయకులు గోపాల్ రావు, బాబాగౌడ్, సాయిలు, రాంచంద్ర రెడ్డి, సంతోష్‌గౌడ్, అశోక్, మల్లేశం, భూమయ్య, విఠల్ తదితరులు ఉన్నారు.

జీవితంలో వ్యాయామం భాగం కావాలి

మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, నవంబర్ 8: నిత్య జీవితంలో వ్యాయామాన్ని భాగం చేసుకోవాలని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సివిల్, ఆర్మ్డ్, రిజర్వ్ పోలీస్, హోంగార్డ్ సిబ్బందికి ఆర్మ్డ్ డ్రిల్, ఫుల్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. వీక్లీ పరేడ్‌తో సిబ్బందికి ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు వ్యాయామం చేయించడం ముఖ్యమన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, ఆర్ఐ శైలందర్, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 8: జిల్లా కేంద్రంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, తదితర పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు ప్రకటనలో తెలిపారు. మెదక్‌తో పాటు మంబోజిపల్లి, చిట్యాల, జానకంపల్లి, మాచవరం, పేరూర్, ర్యాలమడుగు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, నవంబర్ 8: పెద్దశంకరంపేట, జంబికుంట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ యాసిన్ అలీ తెలిపారు. పెద్దశంకరంపేటలోని 33/11 కెవీ శంకరంపేట, 33/11 కెవీ జంబికుంట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

వెల్దుర్తి, నవంబర్ 8: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పర్యవేక్షిస్తే చోరీలు, నేరాలను నియంత్రించవచ్చని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను సీఐ రంగాకృష్ణతో కలిసి సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. నేరాలు, దర్యాప్తు, వాటి పురోగతి వివరాలను ఎస్సై రాజును అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, సిబ్బంది క్వార్టర్స్ పరిశీలించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, వాటి మరమ్మతుల గురించి చర్చించారు.

సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో రఫీకున్నీసా

పెద్దశంకరంపేట, నవంబర్ 8: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి, ఇతర పనులపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీ బృందాలకు ఈజీఎస్ సిబ్బంది సహకరించాలని ఎంపీడీవో రఫీకున్నీసా సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృంద సన్నాహక సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పనులపై నివేదికలు అందజేస్తారన్నారు. ఈజీఎస్ సిబ్బంది, ప్రజలు సహకరించాలని కోరారు.

కారు ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు

మెదక్‌రూరల్, నవంబర్ 8: కళాశాలకు వెళ్లేందుకు బస్టాండ్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థిని అతి వేగంగా వచ్చిన కారు ఢీకొన్న ఘటన మెదక్ మండలం మాచవరంలో జరిగింది. ఈ ఘటనలో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన ఉగ్గి సాయిబాబ మెదక్‌లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు వెళ్లేందుకు మాచవరం గేటు వద్ద బస్సు కోసం వేచి ఉన్నాడు. ఈ క్రమంలో మెదక్ నుంచి నర్సాపూర్ వైపునకు వెళ్తున్న కారు అదుపు తప్పి బస్టాండ్‌లో నిలబడిన విద్యార్థి సాయిబాబాను ఢీకొట్టింది. పక్కన ఉన్న స్తంభానికి ఢీకొని ఆగిపోయింది. ఇది తెలిసిన వెంటనే సాయిబాబాను తల్లిదండ్రులు, గ్రామస్తులు అక్కడకు చేరుకున్నారు. క్షతగాత్రుడిని మెదక్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరిలించారు. విద్యార్థికి న్యాయం జరిగే వరకు కారును అక్కడి నుంచి కదిలించేది లేదంటూ అడ్డుకున్నారు. ఈ ఘటనపై పోలీసులకు వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఏఎస్ఐ వెంకటయ్య తెలిపారు

ఆపదలో అండగా నిలిచిన బాల్య స్నేహితులు

నిజాంపేట, నవంబర్ 8: నార్లపూర్‌కు చెందిన బోయిని రమేశ్ ఇటీవల మృతిచెందాడు. ఆయన పదో తరగతి స్నేహితులు బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. మృతుడి కూతుర్ల పేరిట రూ.20 వేలు ఫిక్స్ డిపాజిట్ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చేగుంట, నవంబర్ 8: చేగుంటకు చెందిన వీరముష్టి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలిసిన అయిత పరంజ్యోతి బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

రైతు ధర్నాకు భారీగా తరలివెళ్లాలి

- నేడు కొల్చారంలో ధర్నాలో పాల్గొననున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారం: రైతు ధర్నా కార్యక్రమంపై నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్, నవంబర్ 8: నేడు కొల్చారం మండల కేంద్రంలో నర్సాపూర్ ఎమ్మెలే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహిస్తున్నట్లు, ధర్నాలో మండలంలోని రైతులు పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ రైతు మహా ధర్నాకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతున్నారన్నారు.

ధర్నాకు భారీగా తరలివెళ్లాలి

కౌడిపల్లి, నవంబర్ 8 : నేడు కొల్చారం మండలంలో రైతుల కోసం నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కౌడిపల్లి మండల బీఆర్ఎస్ మండలాధ్యక్షులు సార రామాగౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతుల కోసం రైతు రుణమాఫీ, రైతుభరోసా, వడ్లకు బోనస్, వడ్ల కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసనగా రైతులు చేపడుతున్న ధర్నాకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరవుతున్నందున ఈ ధర్నా కార్యక్రమానికి కౌడిపల్లి మండలం నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, నవంబర్ 8: మంత్రి తన్నీరు హరీశ్ రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కొల్చారంలో నిర్వహించనున్న రైతు దీక్షకు భారీగా తరలివెళ్లాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్ కోరారు.

విజయవంతంగా సర్వే పూర్తి చేయాలి

- సర్వేకు అందరూ సహకరించాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్
- కలెక్టర్ నివాసంలో సర్వే చేసిన ఎన్యుమరేటర్లు

మెదక్ మున్సిపాలిటీ: కలెక్టర్ నివాసంలో వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు

చిలిపిచెడ్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై పలు సూచనలు ఇస్తున్న నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 8: ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సహకరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శుక్రవారం 3వ రోజు జిల్లా కేంద్రంలోని 1వ వార్డులోని కలెక్టర్ నివాసానికి సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు పూర్తి సమాచారం అందించారు. ఎన్యుమరేటర్ల వద్ద స్టిక్కర్ ఇతర ఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతులు, బలహీనవర్గాల అభ్యున్నతికి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క ఇంటిని వదిలిపెట్టకుండా సర్వే చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. శనివారం నుంచి పూర్తి సమాచారంతో సమగ్ర సర్వే కొనసాగుతుందని ప్రజలందరూ సహకరించాలని కోరారు. సర్వేలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్యుమనరేటర్లు, సిబ్బంది ఉన్నారు.

మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలి

నర్సాపూర్/చిలిపిచెడ్, నవంబర్ 8: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని ఆర్డీవో మహిపాల్ అధికారులకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో, చిలిపిచెడ్ ఎంపీడవో కార్యాయంలో కుటుంబ సర్వేపై సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమినివ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికరైన బాలికల జట్టు

- జిల్లా విద్యాధికారి రాధాకిషన్
- ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 8: తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. శుక్రవారం జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-14 బాలబాలికల ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మెదక్‌లో ఫుట్‌బాల్ స్టేడియం ఉన్నదని, క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులోంచి 18 మంది బాలురు, 18 బాలికలను రాష్ట్రస్థాయిలో పోటీలకు ఎంపిక చేశామన్నారు. వనపర్తిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి నగేశ్, ఎంపికల కమిటీ సభ్యులు దేవేందర్‌రెడ్డి, దుర్గప్రసాద్, పీడీలు శ్రీనివాస్‌రావు, మాధవరెడ్డి, మధు శిక్షకులు భాగ్యమ్మ, రిఫరీ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాస్‌కు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

డిసెంబర్ 4న నిర్వహించనున్న న్యాస్ (జాతీయ సాధన సర్వే) పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని డీఈవో రాధాకిషన్ ఎంఈవోలకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌సీ సెంటర్ ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాస్ పరీక్షకు 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు సన్నద్ధం చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి ఆధార్ నంబర్ వచ్చేలా ఏజెన్సీల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన విద్య అందేలా టీచర్లు కృషి చేయాలన్నారు. ఎంఈవోలు రోజూ 2 పాఠశాలలను సందర్శించాలన్నారు. యూడైస్, ఎఫ్ఆర్ఎస్ యాప్, ఎండీఎమ్ యాప్, ఆప్సీ సివిల్ వర్క్స్, డ్రాప్ బాక్స్ క్లియరెన్స్ అంశాల గురించి వివరించారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారులు సుదర్శనమూర్తి, నవీన్‌కుమార్, సతీశ్‌కుమార్, ఏపీవో రమేశ్ పాల్గొన్నారు.

'అంబేద్కర్ అభయ హస్తం' అమలు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 8: అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అమలు చేయాలని మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రం లో టీఎమ్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన మాట్లాడారు. అంబేద్కర్ అభయ హస్తం పథకానికి బడ్జెట్‌లో రూ.33 కోట్ల నిధులు కేటాయించారన్నారు. ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని ప్రకటించి, వెంటనే అమలు చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాములు, నాయకులు శ్రీనివాస్, సమ్మయ్య, బాబు, రత్నయ్య, రవి, కిష్టయ్య పాల్గొన్నారు.

పోతులబొగుడ పౌల్ట్రీఫాంపై చర్యలు తీసుకోవాలి

పోతులబొగుడ పౌల్ట్రీ ఫాం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట, నవంబర్ 8: మండలంలోని పోతులబొగుడ గ్రామ శివారులో ఉన్న సుగుణ పౌల్ట్రీఫాంపై చర్యలు తీసుకోవాలని పోతులబొగుడ, కొంతాన్‌పల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం పరిశ్రమ ఎదుట వారు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోతులబొగుడ శివారులోని సుగుణ పౌల్ట్రీ ఫాంలోని కోడి ఎరువు, ఇతర కలుషితాలను కొంతాన్‌పల్లి గ్రామ శివారులో పారబోయడంతో అదంతా కొంతాన్‌పల్లి చెరువులోకి వచ్చి చెరువు నీరంతా కలుషితం అవుతుందని ఆందోళన చేశారు. చెరువులో కలుషిత నీళ్లు తాగి పశువులు, చేపలు చనిపోతున్నాయని, అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. కంపెనీ నుంచి వెదజల్లే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి సుగుణ కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యతోనే మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యం

విన్యాసాలు ప్రదర్శిస్తున్న సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్

తూప్రాన్, నవంబర్ 8: విద్యతోనే మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యమని సెంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్ అన్నారు. మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం తూప్రాన్ పోలీసులు పట్టణంలోని నలంద జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యక్తిత్వ వికాసం-సైన్సు- మూఢ నమ్మకాల నిర్మూలన అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో నాటుకుపోయిన మూఢ నమ్మకాలను వదిలి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. మాంత్రికులు, భూత వైద్యులు చేసే కుట్రల వెనక ఉన్న రహస్యాలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వివరించారు. హెడ్ కానిస్టేబుల్ జానీ భాష, నర్సింలు, పెంటయ్య, ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏ రోజుకా రోజు ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

నర్సాపూర్, నవంబర్ 8: ఏ రోజుకా రోజు ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తూ ట్యాబ్ ఎంట్రీ చేస్తూ రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. తుల్జారాంపేట్, గూడెంగడ్డ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయనతో ఏపీఎం గౌరీశంకర్, ఆర్ఐ ఫైజల్ ఉన్నారు.

నిబంధనల ప్రకారమే కొనుగోళ్లు

వెల్దుర్తి, నవంబర్ 8: నిబంధనల ప్రకారం ధాన్యం కొంటారని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని హస్తాల్‌పూర్, నెల్లూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో శుక్రవారం సందర్శించారు.

పాత కక్షలతో మహిళ హత్య

వివరాలను తెలుపుతున్న సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం

నర్సాపూర్, నవంబర్ 8: పాత కక్షలతో ఓ మహిళను హతమార్చిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో హత్యకు కారణమైన నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల క్రితం నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన అంగోత్ శాంత(45) కూరగాయలు అమ్మడానికి నర్సాపూర్‌కు వచ్చింది. ఆ తర్వాత ఆమె అదృశ్యమైంది. ఆచూకీ లభించనందున ఆమె భర్త ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేస్ నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఎల్లారెడ్డిగూడ తండాకు చెందిన సభావత్ అరుణ(30), మృతురాలు శాంతకు మధ్య పాత కక్షలు ఉన్నాయి. దీంతో శాంతిని ఎలాగైనా చంపాలని అరుణ భావించింది. తనకు నర్సాపూర్ కల్లు డిపోలో పరిచయం ఉన్న కొండాపూర్ గ్రామానికి చెందిన చిన్నాగనుగు శ్రీను అదే గ్రామానికి చెందిన కంజర్ల వెంకటయ్యతో వీరి గొడవ గురించి చెప్పింది. శాంతను ఎలాగైనా మట్టుబెట్టాలని, అందుకు తాను రూ.10 వేలు, శాంత కాళ్ల కడియాలు మీకే ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నది. దీనికి వారు ఒప్పుకున్నారు. శాంత కూరగాయలు అమ్ముతుండగా ముగ్గురు కలిసి మాయమాటలు చెప్పి నల్లవల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. వారి వెంట తెచ్చుకున్న మద్యం తాగిన తర్వాత శాంతని తన చున్నీతో గొంతు గట్టిగా నుదిమి చంపేసి, మృతదేహాన్ని అక్కడే వదిలేసి కడియాలు తీసుకెళ్లారు. నర్సాపూర్‌లోని ఒక దుకాణంలో అమ్మి, డబ్బులను శ్రీను, వెంకటయ్య పంచుకున్నారు. తర్వాత సభావత్ అరుణ తను ముందుగా చెప్పిన రూ.10 వేలు బదులు రూ.5 వేలు ఇచ్చి, మిగతాది తరువాత ఇస్తానని తెలిపింది. సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం, పోలీస్ సిబ్బంది ఉపేందర్, శ్రీకాంత్, రవి, సురేశ్ రెండు బృందాలుగా విడిపోయి అనుమానం ఉన్న ముగ్గురిని పట్టుకొని విచారించి, అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు

చేగుంట, నవంబర్ 8: మండలంలోని వడియారంలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో దున్నలను అందంగా అలంకరించి ప్రదర్శించారు. కార్యక్రమంలో వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి, నదీమ్, సాబేర్‌హుస్సేన్, ఒసామొద్దీన్, జూకంటి రాజాగౌడ్, వడ్ల నవీన్ తదితరులున్నారు.

వధూవరులను ఆశీర్వదించిన కంఠారెడ్డి

నిజాంపేట, నవంబర్ 8: నిజాంపేటలోని రేణుక ఫంక్షన్ హాల్‌లో నందగోకుల్‌కు చెందిన లక్ష్మీ రాజయ్య దంపతుల కూతురు పూజ వివాహం శుక్రవారం జరిగింది. ఈ వివాహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కంఠారెడ్డి వెంటా రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగుస్వామి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మావురం రాజు, శ్రీకాంత్, బూర్గుపల్లి ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

నార్సింగి ఎంఈవోగా మురళీమోహన్

చేగుంట, నవంబర్ 8: నార్సింగి ఎంఈవోగా మురళీమోహన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చేగుంట ఎంఈవో నీరజ, శేరిపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం తిరుపతి, వీరేందర్, టీచర్లు సన్మానించారు.

పౌష్టికాహారం అందించాలి

హత్నూర, నవంబర్ 8: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని మండల ప్రత్యేకాధికారి స్వప్న తెలిపారు. శుక్రవారం హత్నూర మండలం కొత్తగూడెం, కోనంపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రా ల బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారుల ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. అనంతరం హత్నూర, రెడ్డిపాలెం, చింతల్‌చెరు తదితర గ్రామాల్లో చేపడుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్ పాల్గొన్నారు.

ఎంఎన్ఆర్ విద్యార్థుల ర్యాలీ

సంగారెడ్డి, నవంబర్ 8: సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని ఎంఎన్ఆర్ డెంటల్ కళాశాల విద్యార్థులు జాతీయ టూత్ బ్రషింగ్‌డే సందర్భంగా శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సంగారెడ్డి ఆర్ఆండ్‌బీ అతిథి గృహం నుంచి పాత బస్టాండు వరకు ఎంఎన్ఆర్ విద్యార్థుల ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర, వైద్యులు రూపా రాణి, యశస్విని, అఖిల, సత్యనారాయణ, శ్రావ్య, డెంటల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు ప్రజలను కలిసి దంత వ్యాధులపై అప్రమత్తత, నోటి పరిశుభ్రత గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు, పోలీసు సిబ్బందికి బ్రష్‌లను అందజేశారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం

సదాశివపేట, నవంబర్ 8: సదాశివపేట నుంచి శబరిమలైకి పాదయాత్రగా వెళ్తున్న నాయుడు గురుస్వామి బృందానికి శుక్రవారం సత్యసాయి జిల్లా కోడూరు దగ్గర మార్గమధ్యలో సాహితీ దవాఖాన మేనేజింగ్ డైరెక్టర్ రాము గురుస్వామి ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు. స్వాములకు కావాల్సిన మందులు అందజేశారు. కార్యక్రమంలో గురుస్వాములు విశ్వనాథం, పరమేశ్వర్, వెంకటస్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED HELPERS
★ హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు ''హెల్పర్లు'' కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం॥లు.
No Consultency, Direct Job. Contact: 9885283513.
NT-335863_All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసు